
# శ్రీనివాసుని దివ్యకథ



ప్రచురణ:
ధర్మప్రచార పరిషత్తు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీనివాసుని దివ్యకథ

రచన :

శిరోమణి శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, ఎం.ఏ.,
విద్వాన్ శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

ప్రకాశకులు:
**శ్రీ ఏ.పి.వి.ఎన్. శర్మ,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# శ్రీనివాసుని దివ్యకథ

మూడవ ముద్రణ :     2,00,000 ప్రతులు
2005

వెల : అమూల్యము

ప్రచురణ :
ధర్మప్రచార పరిషత్తు
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

డి.టి.పి :
టి.టి.డి. ప్రెస్, తిరుపతి.

ముద్రణ :
ఏడ్స్ ప్రింట్,
చెన్నై.

1

శ్రీ వేంకటాద్రినిలయః కమలాకాముకః పుమాన్,
అభంగురవిభూతి ర్న స్తరంగయతు మంగళమ్.

2

శ్రీ వేంకటాచలాధీశం శ్రియాధ్యాసితవక్షసమ్,
శ్రితచేతన మందారం శ్రీనివాస మహం భజే.

3

అఖిలభువనజన్మస్థేమభంగాదిలీలే
వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే,
శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా.

4

నాన్యం వదామి నశృణోమి న చింతయామి
నాన్యం స్మరామి న భజామి న చాశ్రయామి,
ీయ చరణాంబుజ మంతరేణ
శ్రీ శ్రీనివాస పురుషోత్తమ దేహి దాస్యమ్.

5

శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధ యేఽర్థినామ్,
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.

# శ్రీనివాసుని దివ్య కథ

వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన,
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి.

దివ్యక్షేత్రమైన తిరుపతివైభవం కనులారా దర్శించిన ప్రతి ఒక్కరూ వేంకటాచలంతో సమానమైన పుణ్యక్షేత్రం లేదనీ, వేంకటేశ్వరునితో సమానమైనదైవం ఇంతవరకూ లేడు, ఇక ముందు ఉండ బోడనీ, ఇది అక్షరాలా నిజ మనీ అంగీకరిస్తారు.

## క్షేత్ర ప్రశస్తి

అఖండ భరతభూమండలంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఎంద రెందరో వేల్పు లున్నారు. ఆయా దేవతలకు పూజలు, పురస్కారాలు నిత్యం జరుగుతూనే వున్నాయి. యాత్రికులు తండోపతండంగా ఈ క్షేత్రాలు సందర్శిస్తూనే వున్నారు.

అయినా తిరుపతి ప్రాముఖ్యం చాలా విశిష్టమైంది. నిత్య కల్యాణం పచ్చతోరణంగా వెలుగొందుతున్న ఈ దివ్య

ధామానికి ప్రతిదినం వేలకొలది యాత్రికులు భారతదేశం నలుమూలల నుంచి వస్తూవుంటారు. ఆలయంలో భక్తులసందడి లేని దినమంటూ ఉండదు. ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులూ, జ్ఞానులు అనే నాలుగురకాల భక్తులూ ఈ దేవుణ్ణి సేవిస్తారు.

"అడుగడుగు దండాలవాడా ! ఆపద మ్రొక్కుల వాడా ! ఏడుకొండలవాడా ! వేంకటరమణా ! గోవిందా ! " అనే నామ సంకీర్తనలతో దిక్కులు పిక్కటిల్లుతుంటాయి.

ఎంతో శ్రమపడి, ఎంతెంతో దూరంనుంచి యాత్రికులు ఇక్కడికి వస్తారు. తలనీలా లిచ్చి స్వామి పుష్కరిణిలో స్నాన మాడుతారు. మునుక మునుకకూ జన్మజన్మాల కలుషాలు కరగిపోతున్నట్లు భావిస్తారు. నుదుట తిరుమణి, తిరుచూర్ణం ధరించి క్రొత్తరూపం సంతరించు కొంటారు. స్వామి సందర్శనం. కోసం బారులుదీరి ఓపికతో వేచి వుంటారు.

ఎంతసేపూ స్వామిమహిమలే ఒకరికొకరు చెప్పుకుంటూ పరవశించిపోతుంటారు. ఇసుకపాతర వలె ఎంతకూ తరుగని వారి అనుభూతులు వింటుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

శ్రీనివాసుని దివ్యమంగళవిగ్రహం దర్శించగానే వారు తన్మయత్వంతో పులకించిపోతారు. కోరిక లీడేర్చే కొండంత దేవుడి సన్నిధికి చేరుకున్నందుకు ఉప్పొంగిపోతారు. తమ జన్మ ధన్యమైం దని తలచుకుంటారు. సాక్షాత్తు వైకుంఠంలోనే ఉన్నట్లు తలపోసుకుంటారు. మరలివచ్చేటప్పుడు అమృత రూపుడైన స్వామిని వెనుదిరిగి మాటిమాటికి చూస్తారు. ఊర్ధ్వపుండ్ర కలితమైన స్వామివారిశ్రీముఖమండలాన్ని హృదయంలో పదిలంగా ముద్రించుకొని జలజల ఆనంద బాష్పాలు రాలుస్తారు. "వడ్డికాసులవాడా ! వైకుంఠవాసా ! గోవిందా ! గోవింద" అంటూ స్మరించుకొంటారు.

భగవద్దర్శనానంతరం భక్తకోటి ప్రాకారప్రదక్షిణం చేస్తూ విమానవేంకటేశ్వరుణ్ణి నిక్కి నిక్కి చూస్తారు. తరువాత మ్రొక్కుబళ్ళు చెల్లించుకోడానికి హుండి దగ్గరకు వస్తారు. నిండు పిడికిళ్ళు అందులో దులుపుతారు. నిలువు దోపిళ్ళిస్తారు. కొల్హాపురంలో కాపుర మన్న మాటేగాని లక్ష్మి నిజంగా ఇక్కడే నెలకొని వుంది. ముడుపుల సమర్పణ ముగిసిన తర్వాత వారెంతో సమాశ్వాసం పొందుతారు: అవతల

భగవత్ప్రసాదం రెండు చేతులతో స్వీకరిస్తారు. విడువలేక విడువలేక ఎలాగో స్వామిని విడిచి వెళ్లుతారు. ఇది ఆనాటి నుండి ఈనాటివరకూ అనుదినం జరుగుతున్న సత్యమైన కథ; కథగాని కథ.

శ్రీవేంకటాచలం వేదకాలంనుంచి పరమపావన క్షేత్రంగా ప్రఖ్యాతి గాంచిన దివ్యస్థలం. స్వామిపుష్కరిణితోపాటు గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, తుంబురు తీర్థం మొదలైన అనేక పవిత్రతీర్థాలకు ఇది నిలయం. ఎందరో మహర్షులు ఈ కొండలో తపస్సుచేసి ముక్తిని పొందారు. ఎందరో భక్తులు ఈ దేవదేవుణ్ణి సేవించి తరించారు. ఎందరో రాజులు ఈ స్వామికి పలువిధాల కైంకర్యాలు చేసి కృతార్థులైనారు.

కలియుగం ప్రారంభం కాక మునుపే పరమాత్ముడు జీవకోటిని ఉద్ధరించడానికై ఈ కొండమీద నెలకొన్నట్లు పురాణాలు ఘోషిస్తున్నాయి.

ఆళ్వారులు, భక్త కవులు శ్రీనివాసుడి మహిమలు వేనోళ్ళ కొనియాడారు. ఈ కొండలో చెట్టై పుట్టడంకంటె, రాయైపడి వుండటంకంటె మరో సుకృతం లే దని మహాభక్తులు ఉగ్గడించారు.

వేలకొద్ది సంవత్సరాలు గడుస్తున్నా, ప్రపంచచరిత్రలో ఎన్నో వింతమార్పులు పొడచూపుతున్నా శ్రీవేంకటాచల ప్రాశస్త్యం, శ్రీవేంకటేశ్వరునివైభవం పూటపూటకూ పెరుగుతున్నవే గాని తరగడం లేదు.

ఇదంతా శ్రీనివాసుని దివ్యలీల!

అందుకే భక్తాగ్రేసరుడూ, పదకవితా పితామహుడూ అయిన అన్నమయ్య తిరుమల నిలా కీర్తించాడు :

"కట్టెదుర వైకుంఠము కాణాచైన కొండ
తెట్టెలాయె మహిమలే తిరుమలకొండ ॥పల్లవి॥

వేదములే శిలలై వెలసినదీ కొండ
ఏదెస పుణ్యరాసులే ఏరులైనదీ కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ
శ్రీదేవు డుండేటి శేషాద్రి యీ కొండ ॥కట్టె॥

సర్వదేవతలు మృగజాతులై సంచరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
ఉర్వి తపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటికొండ ॥కట్టె॥

వరములు కొటారుగా వక్కణించి పెంచేకొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపు కొండ
కురిసి సంపదలెల్ల గుహలనిండినకొండ
విరివైన దిదివో శ్రీ వేంకటపుకొండ ॥కట్టె॥

సిరులకు నెలవైన శ్రీ శేషగిరిలో నిత్యనివాస రసికుడైన శ్రీనివాసునిదివ్యచరిత్రను పురాణాలు ఎలా వర్ణించాయో చెప్పుకుందాం.

## పురాణకథ

పూర్వం మును లందరూ ఒకచోట సమావేశమై శ్రీ వేంకటేశ్వరుని వైభవం వర్ణింపు మని సూతుణ్ణి ప్రార్థిస్తారు. అతడు బ్రహ్మానందభరితుడై "ఇంతకంటె వినదగినదీ, చెప్పదగినదీ మరేముంటుంది? తప్పక చెబుతాను వినండి", అని కథాకథనానికి ఉపక్రమిస్తాడు.

కలియుగంలో వేంకటాచలం పరమ ప్రశస్తమైన పుణ్యక్షేత్రం. దానిమహిమ వింటే చాలు; సకలశుభాలు

సమకూరుతాయి. కృతయుగంలో వృషాద్రి అనీ, త్రేతా యుగంలో అంజన పర్వత మనీ, ద్వాపరయుగంలో శేషశైల మనీ పిలువబడే గిరివరమే కలియుగంలో వేంకటాచల మని పేరు వహించింది. యుగభేదాన్నిబట్టి ఆ పర్వతానికి నామభేదాలు ఏర్పడ్డాయి.

## వేంకటశబ్దనిర్వచనం

"వేం+కట" అనగా సర్వపాపాలనూ దహించేది అని అర్థం. 'సర్వపాపాని వేం ప్రాహుః కట స్తద్దాహ ఉచ్యతే' అని పురాణ ప్రశంస. వేంకారము అమృతబీజం. కట మనగా ఐశ్వర్యం. అమృతైశ్వర్యములకు ఆలవాలం కాబట్టి కొండకు ఈ పేరు వచ్చిం దని పెద్దలంటారు.

## నారదుని ప్రశ్న

మును పొకసారి కశ్యపాదిమహర్షులు గంగాతీరంలో యజ్ఞం చెయ్యడానికి పూనుకొన్నారు. నారదమహర్షి అక్కడకు వచ్చి "మీ రీయాగం ఎందుకు చేస్తున్నారు? ఈ క్రతుఫలం

ఎవరికి చెందుతుంది? దేవతలలో ధ్యానింప దగినవా డెవడు?" అని వాళ్ళను ప్రశ్నిస్తాడు.

ఆ పలుకులు విని యోగు లందరూ సంశయంలో పడతారు. ఎటూ తేల్చలేక సందేహం నివారింపు మని భృగు మహర్షిని వేడుకుంటారు.

## భృగుమహర్షి పరీక్ష

వేల్పు లందరినీ పరీక్షిస్తేనే గాని వారియోగ్యతా యోగ్యతలు నిర్ణయించటానికి వీలుగాదంటూ భృగుమౌని మొట్టమొదట బ్రహ్మలోకానికి పయనమై వెళతాడు. ఆ సమయంలో చతుర్ముఖుడు సరస్వతీ సమేతుడై దిక్పాలకులతో ఏదో ముచ్చటిస్తూ వుంటాడు. వచ్చిన మునీంద్రుని హెచ్చరించు కోడు. దానితో మహర్షికి "బ్రహ్మదేవుడు అపూజ్యుడు" అనే భావం కలుగుతుంది. అతడు అక్కడ నుండి హుటాహుటి కైలాసానికి పోతాడు.

కైలాసంలో శంభుడు పార్వతీదేవితో విహరిస్తూ ఆ ఋషి వంక కన్నెత్తి అయినా చూడడు. అందువల్ల శంకరుడు గూడా

అపూజ్యుడే అని ముని నిశ్చయించుకొంటాడు. వెంటనే ఆచోటునుండి గిరుక్కున మరలి విష్ణుసందర్శనానికై వైకుంఠనగరానికి వస్తాడు.

అప్పుడు వైకుంఠంలో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో వినోదిస్తూ శేషశయ్య నలంకరించి ఉంటాడు. తనలోకమే తనదిగా వున్న మాధవుణ్ణి చూడగానే మహర్షికి కోపం హద్దు మీరుతుంది. వెంటనే అతడు లక్ష్మీపతివక్షఃస్థలాన్ని కాలితో తంతాడు.

నారాయణుడు దిగ్గన లేచి మౌనికి నమస్కరించి "మునిపుంగవా! అతికోమలమైన మీపాదకమలం; కఠినమైన నావక్షం సోకి ఎంత నొచ్చిందో! ఏదీ చూడనివ్వండి" అంటూ ఆయనపాదాలు కడిగి ఆ జలం తన తలపై చల్లుకుంటాడు.

## పంకజాక్షుడే పరమదైవతం

సత్త్వగుణసంపన్నుడైన మహావిష్ణువే మహానుభావు డనీ, సర్వదేవతాశ్రేష్ఠు డనీ భావించి హరికి జోత లర్పించి ఆ మునీంద్రుడు ఋషులకడకు వచ్చి "పంకజాక్షుడే పరమ

దైవతం. బ్రహ్మరుద్రాదు లెల్లరూ ఆతనికి క్రిందివారే. ఇదే నా నిర్ణయ" మంటాడు.

అందుకు మును లందరూ హర్షించి యజ్ఞఫలాన్ని పరమపురుషుడైన శ్రీమన్నారాయణునికే సమర్పిస్తారు.

## శ్రీదేవి పయనం

వాసుదేవునివక్షఃస్థలం తనకు నిలయం. దానిని పాదంతో ప్రహరించినా పల్లెత్తు మాటనక పైపెచ్చు మాధవుడు మౌనిని సంభావిస్తాడు? అని ఇందిరకు ఎక్కడలేని ఆగ్రహం పుట్టుక వచ్చింది. ఆమె క్రోధావేశంతో "నే నిక్కడ ఒక్కక్షణం ఆగను. నాదారి నాది, మీ దారి మీది" అంటూ తత్క్షణమే లేచి కొల్హాపురానికి వెళ్ళిపోతుంది.

## విష్ణుమూర్తి వేంకటాచలయాత్ర

విష్ణుమూర్తి లక్ష్మీవియోగం భరించలేకపోతాడు. ఆయన విషాదంతో వైకుంఠం విడిచి, సువర్ణముఖీతీరంలో శాంతికి నిలయమైన వేంకటాద్రికి వస్తాడు. అక్క డొకపుట్టలో ప్రవేశిస్తాడు. ఇలా కాలం గడచిపోతుంటుంది.

## మాయగోవు

అది ద్వాపర యుగాంతం. ఆ కాలంలో చోళరాజ్యాన్ని ధర్మాత్ముడైన ఒక చోళ ప్రభువు ఏలుతుంటాడు..శ్రీనివాసుని కోసం బ్రహ్మ గోవుగానూ, రుద్రుడు దూడగానూ మారుతారు. శ్రీమహాలక్ష్మి గోపాలికారూపంలో వచ్చి, ఆ గోవత్సాలను చోళరాజుకు విక్రయించి కొల్హాపురం చేరుకుంటుంది.

దండిగా పాలిచ్చే ఆ ధేనువును రాణి కడు శ్రద్ధగా చూచు కుంటూ వుంటుంది. మాయగోవు రాజుగారి ఆలమందలో చేరి మేతకై వేంకటాద్రికి వచ్చి, అక్కడ శ్రీనివాసుణ్ణి వెదుకుతుంది. పుట్టలో ఆయన్ను పసిగడుతుంది. ఆనాటినుండి అది అను దినం అక్కడికి వచ్చి క్షీరం వర్షించి శ్రీనివాసుణ్ణి తృప్తిపరచేది. తోటిగోవులతో కలసి మళ్ళీ ఊరు చేరుతూ వుండేది.

"కుండ పొదుగులతో మిగిలిన గోవులన్నీ ఇంటికి మరలివస్తే ఈ యావు వట్టిపొదుగుతో రావడానికి కారణ మేమిటి? నీవు పాలన్నీ త్రాగివేస్తున్నావా? నిజం చెప్పు" అని

రాణి పసులకాపరిని నిలదీసి అడుగుతుంది. పాపం గోపాలుడు తనకేమీ తెలియ దంటాడు. బొంకుతున్నాడని ఆమె వాణ్ణి కఠినంగా శిక్షిస్తుంది.

ఆవులంతు తేల్చుకోవా లని మర్నాడు గోపాలుడు ఆలమందతో అడవికి వస్తాడు. ఆ గోవును ఒక కంట కనిపెట్టే ఉంటాడు. అది మామూలుగా పుట్టకడకు పోతుంటే చాటు మాటుగ వుండి అంతా గమనిస్తుంటాడు. పుట్టలోనికి పాలు దిగజారుస్తున్న ఆవును చూడగానే వాడికి ఒళ్లు భగ్గు మంటుంది. వెంటనే గొడ్డలి పైకెత్తి దొంగగొడ్డుతలమీద కొట్టబోతాడు.

## గొల్లవానిమరణం

వల్మీకంలో వున్న శ్రీనివాసుడు చివ్వున వెలుపలికి వచ్చి ఆ గొడ్డలి వ్రేటుకు తన శిర మొడ్డుతాడు. ఆయన తలకు బలమైన గాయమై నెత్తురు పైకెగజిందుతుంది. ఆ పాపానికి ఫలంగా గొల్లడు అక్కడి కక్కడే నేలగూలి మరణిస్తాడు. శ్రీనివాసుడు పుట్టలో ప్రవేశిస్తాడు.

ఆవు పరుగులుదీస్తూ నారాయణపురం చేరుతుంది. అక్కడ రాజుగారి సమ్ముఖంలో పడి దొర్లాడుతుంది. ఈ వైపరీత్య మేమిటో కనిపెట్టు మని రాజు చారుణ్ణి నియోగిస్తాడు. వాడు ఆ గోవువెంట వేంకటాద్రికి వెళతాడు. పుట్టవద్ద చచ్చిపడి వున్న గొల్లవాణ్ణి, పుట్టలో నుంచి పైకి చిందుతున్న రక్తాన్ని చూస్తాడు. భయభ్రాంతుడై పరుగెత్తి వచ్చి వర్తమానం ప్రభువుకు నివేదిస్తాడు.

## వేంకటేశ్వరుని శాపం

భూపాలుడు సంభ్రమాశ్చర్యాలతో అప్పటికప్పుడే బయలు దేరి పుట్టదగ్గరకు వస్తాడు. తత్క్షణమే వాసుదేవుడు వల్మీకం వెడలివచ్చి, "రాజా! నీవు దురాత్ముడివి, అనుచరులు, ఆలుబిడ్డలు చేసే చెడుగులు విచారింవ కున్నావు. యజమానుడు విచారహీనుడైతే భార్యాపుత్రాదులు చేసిన దుష్కర్మఫలం అతణ్ణి అంటకమానదు. నీ మూలంగా నాకు దుఃఖం కలిగింది. కనుక పిశాచం క"మ్మని శపిస్తాడు.

పిశాచరూపం పొందిన చోళుడు దీనంగా "దేవా! నేను నిరపరాధిని. న న్నిలా ఎందుకు శపించావు? "అంటాడు.

శ్రీనివాసుడు - "నిత్యమూ నాకు పాలిస్తున్న ధేనువు మీది వాత్సల్యంతో ని న్నిలా శపించవలసివచ్చింది. నా భక్తులకు బాధ గలిగితే నేను బొత్తిగా సహించలేను. నీవు కొంతకాలం ఈ రూపంతో వుండక తప్పదు. అవతల ఆకాశరాజుగా జన్మిస్తావు. అంతటితో నీకు శాపవిమోచన మవుతుంది. అటుపై నీ పుత్రికను నా కిచ్చి పెళ్ళిచేస్తావు. నాకు ఇష్టుడ వౌతావు. విచారించకు" అని అనుగ్రహిస్తాడు.

## స్వాముల కలయిక

పూర్వకల్పంలో శ్రీ మహావిష్ణువు శ్వేత వరాహ రూపంతో హిరణ్యాక్షుణ్ణి సంహరిస్తాడు. శిష్ట రక్షణకై ఆయన వేంకటాద్రిలో నివాస ముంటాడు. ఒకనాడు వృషభాసురుణ్ణి చంపి తిరిగి వస్తూ అక్కడ విహరిస్తున్న శ్రీనివాసుణ్ణి వరాహస్వామి చూస్తాడు. చూచి "నీ వెవరు? ఇక్క డెందు కున్నావు" అని ప్రశ్నిస్తాడు.

తాను వాసుదేవుడననీ, లక్ష్మి తనపై అలిగి వెళ్ళి పోయిం దనీ, ఆత్మశాంతికోసం ఇక్కడ వల్మీకంలో ఉంటున్నాననీ, కలియు గాంతం వరకూ ఇక్కడే వుండా లని ఉబలాట

పడుతున్నా ననీ, తనకు ఆవాసస్థలం కల్పించ మనీ శ్రీనివాసుడు క్షేత్ర ప్రభువైన వరాహస్వామిని అర్థిస్తాడు.

వరాహస్వామి తనకు తగిన మూల్యం ఇచ్చి స్థలం కొనుక్కోమనిచెపుతాడు. "నా వద్ద డబ్బులేదు. నాకు చోటిస్తే భక్తులు నాకంటె ముందు నిన్ను దర్శించేటట్లూ, నీకే ప్రథమ నైవేద్యం సమర్పించేటట్లూ చేస్తా నని శ్రీనివాసుడు మాట యిస్తాడు. అందుకు వరాహస్వామి అంగీకరిస్తాడు.

ఈ విధంగా ఏకరూపులైన స్వాము లిద్దరూ భక్తుల కొరకు వేంకటాద్రిలో వినోదం సల్పుతారు.

### వకుళాదేవి

అపైన వరాహస్వామి తనకు సేవ చేస్తున్న వకుళాదేవిని శ్రీనివాసునిసేవకు వినియోగిస్తాడు. ఆమె ప్రతిదినమూ అన్నపానాలు సమకూరుస్తూ అచ్యుతుణ్ణి కొలుస్తుంది.

ఈ వకుళాదేవి శ్రీకృష్ణావతారకాలంనాటి యశోదాదేవి. యశోదగా కృష్ణుణ్ణి ఎంతగా లాలించి పాలించినా ఆమె కప్పుడు పుత్రమోహం తీరలేదు. మరికొంతకాలం మాధవుని

మంగళ రూపాన్ని సేవించా లని ఉబలాటపడుతుంది. తన అభిలాష తెలుపుకుంటుంది. "నీమనోరథం మరొకజన్మలో నెరవేరుతుంది" అని శ్రీకృష్ణు డామెకు వరమిస్తాడు. ఆ వరప్రభావం వల్లనే యశోద వకుళాదేవిగా అవతరించి, ఇప్పుడు శ్రీనివాసుని సేవాభాగ్యం చుబ్బనచూరలాడుతుంది.

ఇంతలో కలియుగం వస్తుంది. శాపగ్రస్తుడైన చోళ విభుఢు ఆకాశరాజుగా ఆవిర్భవించి నారాయణపురానికి నాథు డవుతాడు. అతనికి తొండమానుడనే సోదరుడుగూడా ఉంటాడు.

## పద్మావతీజననం

ఆకాశరాజుకు బహుకాలం సంతానం లేదు. అందు కోసం ఆయన యజ్ఞం సంకల్పించి స్థలాన్ని దున్నుతుండగా సహస్రదళపద్మ మొకటి అక్కడ ప్రత్యక్ష మవుతుంది. అందులో ఒక స్త్రీశిశువు కనిపిస్తుంది.

రాజు ఆ వింతశిశువును విస్తుపడి చూస్తుండగా ఆకాశవాణి - "రాజా! ఈమెను నీ కొమార్తెగా స్వీకరించి

పెంచి పోషించు. ఈ బిడ్డవల్ల నీకు అపారమైన కీర్తి లభిస్తుంది" అంటుంది.

రాజు ఎంతో సంతోషించి ఆ కసుగందును పత్నియైన ధరణి దేవికి అప్పగించి, పద్మంనుంచి ప్రభవించింది గనుక ఆమెకు 'పద్మావతి' అని నామకరణం చేస్తాడు.

## వసుదానునిజననం

పద్మావతి ఇంటికి వచ్చిన శుభవేళ ఎలాంటిదో గాని వెంటనే రాణి గర్భం దాలుస్తుంది. నవమాసాలు నిండి ఒక పుత్రుణ్ణి కంటుంది. అతనికి ఆకాశరాజు వసుదానుడు అని పేరు పెడతాడు. రాజదంపతులు బిడ్డ లిద్దరినీ అల్లారు ముద్దుగా పెంచుతారు.

పద్మావతి యుక్తవయస్కురాలవుతుంది. తండ్రి ఆమెకు అన్నివిధాల అనురూపుడైన వరునికొరకు అన్వేషిస్తుంటాడు.

## నారదునిజోస్యం

ఒకనాడు చెలికత్తెలతో పద్మావతి ఉద్యానవనంలో విహరిస్తుంటుంది. అక్కడికి ఆకస్మికంగా నారదుడు వచ్చి

ఆమె చేయి చూచి "నీకు లోకేశ్వరుడైన నారాయణుడు నాథుడు కానున్నా" డని జోస్యం చెప్పి అంతర్ధాన మవుతాడు.

## పద్మావతీ శ్రీనివాసుల సమాగమం

ఆనాడే శ్రీనివాసుడు గుఱ్ఱమెక్కి కిరాతవేషంతో వేంకటాద్రినుండి వేటకు బయలుదేరుతాడు. ఒక మదపు టేనుగును తరుముకుంటూ వస్తాడు. అలా వచ్చి వచ్చి పద్మావతి తనసఖులతో విహరిస్తున్న ప్రమదవనంలో ప్రవేశిస్తాడు. పద్మావతీ శ్రీనివాసులు పరస్పరం చూచు కుంటారు.

వెంటనే చెలికత్తెలు - "అయ్యా, నీ వెవరు? ఇక్కడి కెందుకు వచ్చావు? ఇది పురుషులు రాకూడని ప్రదేశం. సత్వరంగా వెళ్ళు" అని హెచ్చరిస్తారు.

"నేను మీరాజపుత్రికొరకే వచ్చాను. నా కామెతో పని ఉంది" అంటాడు శ్రీనివాసుడు.

"ఏమిటా పని? అసలు నీ వెవరు? నీ పేరేమి? ఊరేమి? కులగోత్రా లేమిటి? నీతలిదండ్రు లెవరు?" అని వారు గద్దిస్తారు.

"చెప్పితిని గదా! మీ రాకొమార్తెతో నాకు పని వుం దని. నే నామెతోనే మాట్లాడాలి"

అంటూ శ్రీనివాసుడు పద్మావతిని జూచి - "మాది చంద్రవంశం. నన్ను కృష్ణు డంటారు. నా జననీ జనకులు దేవకీ వసుదేవులు. మఱి నీకులగోత్రా లేమిటో, వినవచ్చా?" అంటాడు.

అందుకు పద్మావతి - "నేను ఆకాశరాజుపుత్రిని. నాపేరు పద్మావతి. వివరాలు చాలునా? ఇక మీరు దయచేయవచ్చు" అంటుంది.

సఖులు కిలకిలా నవ్వుతారు. అంతట శ్రీనివాసుడు "పద్మా! ఆ మాటలే కాస్త మెల్లగా మృదువుగా రానీయరాదా? నిన్ను చూడగనే నామనస్సు ఏమేమో అవుతున్నది. నాతో ఇంత నిష్ఠురంగా పలుకదగునా? నేను నీవాడనేగదా! నన్ను పతిగా స్వీకరించు" అంటాడు.

రాకుమారికి కోపంతో కండ్లు ఎరుపెక్కుతాయి. "నన్ను అనరాని మాట లంటున్నావు. మాజనకుడు చూస్తే నిన్ను

ప్రాణాలతో విడిచిపెట్టడు. బతుకు మీద ఆశవుంటే ఇక్కడనుండి వెంటనే వెళ్ళిపో" అని హెచ్చరిక చేస్తుంది.

"మీ తండ్రి నన్ను శిక్షించటానికి నేను చేసిన నేరమేమిటి? నీవు కన్యవు. నేను వరించడం తప్పా?" అంటూ శ్రీనివాసుడు ఆమెను సమీపిస్తాడు. పద్మ కోపోద్రేకంతో అచటినుండి రివ్వున కదలి వెళుతుంది.

## శ్రీనివాసుని విరహం

శ్రీనివాసుడు నిజనివాసానికి మరలివచ్చి చింతతో సెజ్జపై మేను చేరుస్తాడు. వకుళాదేవి వచ్చి కన్నీరు కారుస్తున్న శ్రీనివాసుణ్ణి చూచి కళవళపడి కారణ మడుగుతుంది.

అతడు తాను వేటకై వెళ్ళి ఒక ఉద్యానవనంలో పద్మావతి అనే కన్యను చూచినాననీ, ఆమెను తనదాన్నిగా చేసుకోవాలనీ, అలా జరుగకపోతే తాను జీవింపలేననీ, చెప్తాడు. అందుకు వకుళాదేవి సంభ్రమంతో "ఆ కన్యతండ్రి ఎవరు? నివాస మెక్కడ?" అని అడుగుతుంది.

## వేదవతీ వృత్తాంతం

శ్రీవేంకటేశ్వరుడు - "ఆమె నారాయణపురం పాలించే ఆకాశరాజు కూతురు. త్రేతాయుగంలో ఆమె వేదవతి. రావణాసురుడు సీత నపహరించుక వెళ్ళడానికి వచ్చినపుడు అగ్నిదేవుడు జానకిని రక్షించడానికై ఆమెకు బదులుగా వేదవతిని పర్ణశాలలో ఉంచాడు. సీతారూపంలో వున్న వేదవతినే దశకంఠుడు లంకకు ఎత్తుకపోయాడు. రావణ సంహారానంతరం సీతను అగ్నిప్రవేశం చెయ్య మని నేను ఆదేశించినపుడు అగ్నిలోంచి మరొకసీత వెలువడింది. రెండవ యామె ఎవ రని నేను మైథిలిని ప్రశ్నించాను. ఆమె వేదవతి. నాకొరకై లంకలో పడరాని బాధలు పడింది. నాతోపాటు మీ రీమెను ధర్మపత్నిగా స్వీకరించండి అని జానకి న న్నపుడు వేడుకొన్నది. నే నపుడు ఏకపత్నీ వ్రతుణ్ణి గనుక ఇపుడు కాదు. మరో జన్మలో ఆమెను పత్నిగా పరిగ్రహిస్తానని ఆమెకు మాట ఇచ్చాను. ఆ వేదవతే పద్మావతిగా ఇపుడు ఆకాశరాజు గృహంలో వెలసింది" అని ఆమె వృత్తాంతం చెబుతాడు.

వకుళాదేవి సంతసించి వెనువెంటనే కన్య నడగటానికై నారాయణపురానికి పయనమై వెళుతుంది.

## పద్మావతీవిరహం

అక్కడ పద్మావతి కిరాతవేషంలో వచ్చిన మాధవుడిపై మరులుగొని అన్నపానీయాలు విసర్జించి, చింతతో చిక్కి సగమవుతుంది. చెలికత్తెలు ఉద్యానవనంలో జరిగిన సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు ఆమె తలిదండ్రులకు మనవిచేస్తారు. రాజదంపతులు ఆలోచనలోపడతారు.

## ఎఱుకలసాని గద్దె

ఇంతలో శ్రీనివాసుడు ఎఱుకలసాని వేషంలో ధరణీ దేవి దగ్గరకు వస్తాడు. రాజపత్ని తనకొమార్తె పరిస్థితి మనసులో పెట్టుకొని గద్దెచెప్పు మని ఎఱుకలసానిని కోరుతుంది.

శ్రీ వేంకటేశ్వరుడు, "నీ కూతురు కిరాతవేషంలో వేటకై వచ్చిన శ్రీనివాసుణ్ణి ఉద్యానవనంలో చూచి మోహించింది. ఆయన కీమె నిచ్చి పెండ్లి చేస్తే ఆమె బాధ తీరుతుంది. అలా

జరగకపోతే వేదనతో ఆమె అసువులు వీడుతుంది. ఇప్పుడే శేషశైలంనుంచి ఒకవృద్ధురాలు పెండ్లిరాయబారానికై మీ చెంతకు వస్తుంది. మీరు సంశయపడక వెంటనే వివాహ నిర్ణయం చెయ్యండి" అని చెప్పి వెళ్ళిపోతాడు.

ఎఱుకలసాని అలా వెళ్ళగానే వకుళాదేవి ధరణిదేవి దగ్గరకు వస్తుంది. తాను కన్యార్థమై వేంకటాద్రినుండి వచ్చినానంటూ శ్రీనివాసుని కులగోత్రనామనక్షత్రాదులు వివరిస్తుంది.

## పెండ్లి ముహూర్తం

రాజదంపతులు తమకూతురికి తగిన వరుడే లభించి నందుకు ఆనందభరితులై బృహస్పతితో సమాలోచించి వైశాఖ శుక్ల దశమీ శుక్రవారం శ్రీనివాసుడికి పద్మావతి నిచ్చి పరిణయం చెయ్యడానికి లగ్నంపెట్టి శుకునిద్వారా శుభలేఖ తిరుమలకు పంపుతారు.

ఈలోగా తనరాకకై ఎదురు చూస్తున్న వేంకటేశ్వరునితో వకుళాదేవి తాను కార్యం పండించుక వచ్చా నని చెప్పి

ఆనందపరుస్తుంది. ఆవల శుకసందేశం అందగా స్వామి పొంగిపోతాడు.

## దేవతల ఆగమనం

తరువాత వేంకటాచలపతి తనపరిణయోత్సవానికి బ్రహ్మరుద్రాదిదేవతాగణాన్ని ఆహ్వానిస్తాడు. వా రందరూ శేషాచలానికి సపరివారంగా తరలివస్తారు. వచ్చినవారి నందరినీ వేంకటరమణమూర్తి ఆదరిస్తాడు.

లక్ష్మి లేని పెండ్లి పెండ్లి గాదని గోవిందుడు కొల్హాపురం నుంచి శ్రీదేవిని రప్పిస్తాడు. ఆమె వేంకటాద్రికి వచ్చి తాను చెప్పిన వేదవతినే పరంధాముడు పరిణయ మాడబోతున్నందుకు ఎంతో మురిసిపోతుంది.

శ్రీలక్ష్మి శ్రీనివాసునికి మంగళస్నానం చేయిస్తుంది. పార్వతి, సరస్వతి, సావిత్రి మున్నగు సువాసినులు శేషగిరి వాసుణ్ణి సర్వాలంకారశోభితుణ్ణి గావిస్తారు. వసిష్ఠాది మహర్షులు పుణ్యాహకార్యాలు నిర్వర్తిస్తారు.

## అసలు తీరని అప్పు

శ్రియఃపతి తనకల్యాణానికి కుబేరునివద్ద పద్నాలుగు లక్షల రామముద్రికలు అప్పుగా తీసుకుంటాడు. వడ్డీ చెల్లిస్తూ కలియుగాంతాన అసలు దీరుస్తా నంటాడు. ఈ పైకంతో ముకుందుడు ముక్కోటిదేవతలకూ, అశేషఋషిగణాలకూ మృష్టాన్న సంతర్పణ చేస్తాడు.

ఆ మరునాడు స్వామి సపరివారంగా నారాయణపురానికి బయలుదేరుతాడు. ఆకాశరాజు తనసోదరుడైన తొండమానునితో ఎదురేగి గంధమాల్యాదులతో పూజించి వాసుదేవుడికి వస్త్రాభరణాలు సమర్పిస్తాడు.

ఆ రాత్రి ఆకాశరాజు పతితపావనుడైన పరమాత్ముని పరివారానికి భోజనాదిసకలసౌకర్యాలు సమకూర్చి, వాళ్ళ నందరినీ సంతోషపెడతాడు.

## పద్మావతీశ్రీనివాసులపరిణయం

మరునాటి సాయంకాలం వరపూజ జరుగుతుంది. ఆకాశరాజు మంగళవాద్య పురస్సరంగా శ్రీనివాసుణ్ణి గజం మీద

ఊరేగిస్తూ వివాహమండపానికి తోడ్కొని వస్తాడు.

అక్కడ తొండమానుడి భార్య స్వామికి కర్పూర నీరాజనం ఇస్తుంది. వరుడు రత్నపీఠం అధిష్ఠిస్తాడు అనిమిషులు, ఋషులు పరిణయోత్సవం తిలకించాలనే కుతూహలంతో క్రిక్కిరిసి కూర్చుంటారు.

పురోహితుడు సంకల్పం చెపుతుండగా ఆకాశరాజు మధుపర్కం ఇచ్చి శ్రీనివాసుడి పాదాలు పన్నీటితో కడుగుతాడు. గంధపుష్పాలతో అర్చిస్తాడు. ఇంతలో సుముహూర్తం సమీపిస్తుంది.

శ్రీహరి పద్మావతిచేతికి కంకణం కడతాడు. దివ్య శంఖాలూ తిరుచిహ్నలూ, వేణు వీణా మృదంగాది వాద్య ధ్వనులూ మిన్ను ముట్టుతుండగా సిగ్గుబరువున తలవంచి కూర్చున్న పద్మావతీదేవికంఠంలో స్వామి మంగళసూత్రం ముడివేస్తాడు. పిమ్మట వధూవరులు ముత్యాల తలంబ్రాలు పోసుకుంటారు. తక్కిన పెండ్లితతంగమంతా శాస్త్రోక్తంగా జరిగిపోతుంది. దేవతలూ, ఋషులూ ఆ దివ్యదంపతుల్ని ఆశీర్వదిస్తారు.

ఆకాశరాజు అంగరంగవైభవంగా పెళ్ళి జరిపి అల్లుడికి కోటినిష్కాలు, అనంతకోటి ఆభరణాలు కానుకగా ఇస్తాడు. పెళ్ళికి వచ్చిన పిన్నపెద్దలనూ, బంధుమిత్రులనూ యథోచితంగా సత్కరిస్తాడు.

## ఆశ్రమ నివాసం

శ్రీనివాసుడు పద్మావతీసమేతంగా బ్రహ్మాదిదేవతలతో వేంకటాద్రికి పయన మవుతాడు. వివాహదీక్షవల్ల ఆయన ఆరుమాసాలవరకూ కొండెక్కరాదు గనుక సువర్ణముఖీ తీరంలోని అగస్త్యాశ్రమంలో అంతవరకూ ఉండా లని నిశ్చయించుకుంటాడు. దేవతలు దేవదేవుడివద్ద సెలవు పుచ్చుకొని నిజనివాసాలకు మరలుతారు. మహాలక్ష్మి కొల్హాపురానికి మళ్ళీ వెళ్ళిపోతుంది.

ఇలా వుండగా ఆకాశరాజు మరణశయ్యలో ఉన్నా డన్నవార్త తెలిసి పద్మావతీశ్రీనివాసులు నారాయణపురానికి వెళతారు. అసువులు వీడనున్న కొడుకును, తమ్ముణ్ణి అల్లుడి కప్పగించి నిశ్చింతగా కన్నుమూస్తాడు.

## తండ్రికొడుకుల పోరు

కొద్దిరోజుల్లోనే రాజ్యవిషయమై వసుదానుడికీ పినతండ్రి తొండమానుడికీ మధ్య కలత లేర్పడుతాయి. ఉభయులూ యుద్ధానికి సన్నద్ధులై సహాయంకొరకు శ్రీనివాసుని దగ్గరకు వస్తారు. పద్మావతి కోరికప్రకారం శ్రీపతి వసుదానునిపక్షం వహిస్తాడు. పరమభక్తుడైన తొండమానుడికి తోడ్పాటుగా తన శంఖచక్రాల నిస్తాడు.

తండ్రికొడుకులకు పోరు ఘోరంగా జరుగుతుంది. చివరకు అగస్త్యమహర్షి అభిమతాన్ని అనుసరించి శ్రీనివాసుడు కలుగజేసుకొని రాజ్యం వా రిద్దరికీ చెరిసగం పంచియిచ్చి కయ్యం మాన్పుతాడు. వసుదానుడు నారాయణపురానికి, తొండమానుడు తుండీరమండలానికి అధిపతులౌతారు. ఇరువురూ సంతోషంతో మురారికి ముప్పైరెండు గ్రామాలు బహూకరిస్తారు. స్వామి బంధువు లిద్దరినీ సమరసపరచి అగస్త్యాశ్రమానికి మరలివస్తాడు.

ఒకనాడు పురాణపురుషుడైన శ్రీమన్నారాయణుని దర్శనార్థం తొండమాను చక్రవర్తి అగస్త్యాశ్రమానికి వస్తాడు.

శ్రీనివాసుడు తనకు శేషాద్రిమీద ఒక సుందరమందిరం నిర్మించ మని అతణ్ణి కోరుతాడు. ఆరునెలలు నిండగానే అగస్త్యాశ్రమంనుంచి అందరూ కలిసి శేషగిరికి వెళతారు.

## తొండమాను కైంకర్యం

వరాహస్వామి అంగీకారంతో స్వామిపుష్కరిణికి దక్షిణపు టొడ్డున తూర్పుముఖంగా ఆలయనిర్మాణం ప్రారంభమై విమానంమీద సువర్ణకలశస్థాపనతో పని పరిపూర్తి అవుతుంది.

ఇంద్రాది దేవతల జయజయ ధ్వానాలతో, వేదనినాదాలతో, మంగళతూర్యఘోషలతో దిక్కులు ప్రతిధ్వనిస్తుండగా తొండమానుడు నిర్మించిన ఆనందనిలయ మని పిలువబడే విమానంలో స్వామి పద్మావతీయుక్తంగా ప్రవేశిస్తాడు.

## బ్రహ్మకోరిన వరం

లోకహితం కాంక్షించి పరమేష్ఠి పద్మనాభుని అవతారం కలియుగాంతంవరకూ ఉండేటట్లు వరం కోరుతాడు. అందుకు శ్రీవేంకటేశ్వరుడు సమ్మతిస్తాడు.

## బ్రహ్మోత్సవం

ధ్వజారోహణతో ఆరంభమై రథారోహణతో అంత మయ్యేట్లు ఉత్సవం తనకు జరిపించ మని పరమాత్మ బ్రహ్మను ఆదేశిస్తాడు. విరించి విశ్వకర్మచే వివిధములైన వాహనాలూ, ఛత్రాలూ, చామరాలూ, రథమూ నిర్మింపజేసి సకల వైభవాలతో స్వామికి తొలి ఉత్సవం నవాహ్నికముగా కన్యామాసంలో జరిపిస్తాడు.

## అర్చామూర్తి

శ్రీవేంకటేశ్వరుడు ఆనాటినుండీ అర్చామూర్తిగా వెలుగొందుతున్నాడు. అతడు కలియుగంలో మౌనం వహించి వుంటాడు. అంతా చూస్తూనే చూడనివాని మాదిరి కనబడతాడు. ఒక్క భాషణం తప్ప మిగిలిన నిగ్రహానుగ్రహశక్తులన్నీ మునుపటివలెనే ఆయన కుంటాయి.

భక్తితో చేసిన స్వల్పపూజచేత, అల్పదానంచేత ఆయన ప్రసన్ను డవుతాడు. తిరుమలకు యాత్రచేయడంవల్లనే ప్రసన్నుడై భక్తుల కోరికలు ఈడేరుస్తాడు.

తాను భగవంతు డైనప్పటికీ మానవభోగాలను ప్రీతితో అనుభవిస్తాడు. కలియుగంలో దేవతలుగూడ స్వామి సేవకు వస్తారు. సర్వపుణ్యతీర్థాలకూ నిలయమైన స్వామి పుష్కరిణిలో స్నానమాడి శ్రీనివాసునికి నివేదనలు నల్పుతారు. మనుష్యులకు గోచరింపకుండా వేంకటాచలపతి నివేది తాన్నాలను ఆరగిస్తాడు.

శ్రీవేంకటేశ్వరుడు కలిలో ధనార్జనపరు డవుతాడు. లోకానుగ్రహంకొరకే ఆయ నిలా ప్రవర్తిస్తాడు.

వక్షమున లక్ష్మిని దాల్చి, వామహస్తమును కటియం దుంచుకొని, దక్షిణహస్తంతో తన పాద పద్మాలను చూపుతూ ఆనంద నిలయంలో శ్రీనివాసుడు వేంచేసి యున్నాడు. అశేష భక్తజనానికి అభీష్టాలు నెరవేరుస్తూ ఆనందసంధాయకు డవుతున్నాడు.

అని ఈ విధంగా శ్రీ వేంకటేశ్వర దివ్యవైభవం సూతుడు మునిమండలికి వివరిస్తాడు. వారు పరమహర్షం పొంది సూతుణ్ణి పలువిధాల ప్రశంసిస్తారు.

శ్రీనివాసుని గూర్చిన ప్రశంస సంస్కృత పురాణాల్లోనేగాక ఆంధ్ర తమిళాది దేశభాషల్లో గూడా విపులంగా కనిపిస్తుంది. ఈయన్ను గురించి ఎన్నో శతకాలు, కావ్యాలు, కథలు, కీర్తనలు వెలిశాయి.

పురాణ యుగానికి చెందిన మహర్షులేగాక నవీన కాలంలో గూడా ఎందరో మహనీయులు శ్రీ వేంకటేశ్వరుణ్ణి కొలిచి ధన్యులయ్యారు. తాళ్ళపాక అన్నమాచార్యులు, శ్రీ కృష్ణదేవరాయలు, తరిగొండ వేంగమాంబ, ఇటీవలి మలయాళ స్వామి శ్రీనివాసుని కీర్తించి, నుతించి, భజించి తరించినవారే. ఆశ్రితమందారుడైన ఆ ప్రభుని అనుగ్రహానికి పాత్రులు కానివా రెవరు?

వేంకటాద్రి శ్రీనివాసునకు క్రీడాచలం. ఆయనకు వైకుంఠ విరక్తి గల్గించిన ఈ పర్వత మహిమ వర్ణనాతీతం. ఈ కొండ నూరుకోట్ల యేండ్లనాటి దని చారిత్రకుల నిర్ణయం.

ఏడుకొండలమీద నెలకొన్న వేల్పు కాబట్టి ఈయన ఏడుకొండలవా డైనాడు. అంజనాద్రి, వృషభాద్రి, నీలాద్రి,

శేషాద్రి, గరుడాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి అనేవి ఈ సప్త శైలాలు.

తిరుపతి చేరడానికి నే డనేక ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. తిరుపతికి వచ్చిన యాత్రికులు బస్సులలో, కాలినడకతో తిరుమలకు చేరుతుంటారు. కొండపైకి చక్కని మెట్లమార్గం ఎప్పటినుంచో ఉన్నది. దారిపొడుగునా స్వామి సన్నిధికి సాగిపోతున్నప్పుడు కలిగే ఆనందం అనుభవైక వేద్యం.

యాత్రికులకు తిరుపతిలోగాని, తిరుమలలో గాని వుండడానికి మంచి వసతులు దేవస్థానం కల్పించివుంది.

స్వామి సందర్శనానంతరం కొండ దిగిన యాత్రికులు తిరుపతిలో గోవిందరాజస్వామిని, కోదండరామస్వామిని, కపిలేశ్వరస్వామిని సేవిస్తారు. తిరుపతికి మూడుమైళ్ళ దూరంలో ఉన్న తిరుచానూరు లేక అలమేల్మంగాపురం వెళ్లి భక్తులు శ్రీ పద్మావతీదేవిని సందర్శిస్తారు. తిరుపతికి పశ్చిమంగా ఏడుమైళ్ళ దవ్వులో శ్రీనివాస మంగాపురం వుంది. అక్కడ కల్యాణ వేంకటేశ్వరుని భక్తులు భజిస్తారు.

నూటెనిమిదివైష్ణవక్షేత్రాలు దివ్యతిరుపతులనే వ్యవహరింప బడుతున్నాయి. ఇట్టి తిరుమలాధీశుడు తెలుగు దేశంలో నెలకొని, తెలుగువారి ఇలువేలుపై తెలుగువారి బ్రదుకులు పండించటం విశేషం.

శ్రీ వేంకటేశ్వరుడు దేశం నలుమూలల నుంచి ఏడాది పొడుగునా కోట్లాది భక్తులను తన దివ్యసన్నిధికి ఆకర్షిస్తున్నాడు. కోట్లకొలది ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నాడు.

పిలిచేవారికి పలికే దైవమై, కొలిచేవారికి కొంగు బంగారమై ఆయన నిత్యపూజలు అందుకుంటున్నాడు. భక్తులకు ఇహంలో భుక్తినీ, పరంలో ముక్తినీ ప్రసాదిస్తున్నాడు.

ఏడుకొండలవాని చలువతో తిరుపతిలో విశ్వవిద్యాలయమే వెలసింది. కలియుగవైకుంఠంగా గణనకెక్కిన తిరుపతి ప్రపంచ ప్రసిద్ధపవిత్రక్షేత్రమే గాక ఈనాడు విశ్వ విఖ్యాతమైన విద్యా కేంద్రంగాకూడా వన్నె కెక్కింది.

భగవంతుని ద్రవ్యంతో యాత్రికులకు సకల సౌకర్యాలూ సమకూర్చబడతున్నాయి స్వామిధనంతో ఎన్నో విద్యాసంస్థలు, వైద్యాలయాలు నడుపబడుతున్నాయి. ఏటా వందలాది పవిత్ర గ్రంథాలు ప్రచురింపబడుతున్నాయి.

ఆధ్యాత్మిక సభలు, భజనలు, హరికథలు, పురాణ ప్రవచనములు, సంగీతసభలు, సత్సంగాలు విరివిగా సాగుతున్నాయు. అనేక ధర్మసంస్థలకు ఆర్థికసహాయం అందింపబడుతున్నది. ఈ దేవుని విత్తంతో శిథిలావస్థలో వున్న దేవాలయాలు జీర్ణోద్ధారం పొందుతున్నాయి. ఎన్నో కల్యాణ మండపాలు దేశం నలుమూలలా నిర్మింపబడుతున్నాయి. పలుభాష లలో వెలువడే మాసపత్రికల ద్వారా అవిచ్ఛిన్నంగా ధర్మ ప్రచారం కొనసాగుతున్నది. ఇలా శ్రీనివాసుని నిధి ఎన్నో ధర్మకార్యాలకు సద్వినియోగ మవుతున్నది.

అనుదినం తన సమ్ముఖానకు వస్తున్న వేలకొలది భక్తజనానీకానికి సర్వలోక శరణ్యుడైన శ్రీవేంకటేశ్వరస్వామి తన దివ్యచరణాలే శరణాలని క్రిందికిచాచిన చేతితో చూపుతున్నాడు.


సంసారసాగరంలో పడి తాపత్రయంతో తపిస్తున్న మనుజకోటికి కమలాపతిచరణకమలసేవకన్న తరణోపాయం మరొక్కటి లేదు.

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

అందుకనే తిరుపతికి రావాలి. శ్రీనివాసుని సేవించాలి. తరించాలి.

వృష శైలాధిప ఏవ దైవతం నః
వృషభాద్రీశ్వర ఏవ దైవతం నః
ఫణి శైలాధిప ఏవ దైవతం నః
భగవాన్ వేంకట ఏవ దైవతం నః

శ్రీశ్రీనివాసః పరదైవతం నః
శ్రీశ్రీనివాసః పరమం ధనం నః
శ్రీశ్రీనివాసః కులదైవతం నః
శ్రీశ్రీనివాసః పరమా గతి ర్నః




Published by Dharma Prachara Parishat T.T.D.
and Printed at Adsprint, T.Nagar, Chennai -17